# అంత్య దినములందు...

అంత్య దినములందు మేం ఉండగా
నీ ఆత్మ కుమ్మరింపు నీయుమా
" మేం దర్శనాలు చూచి, మేం ప్రవచనాలు చెప్పి
- లోకమందు మార్పు తెచ్చెదం.
ఆది సంఘమల్లె మేము, ఆత్మ అగ్నితోడ రగిలి
- క్రీస్తు సిలువనెత్తి చూపెదం
యేసుదే ఈ తరం - యేసుకే యువతరం"

1. ఏలియా ప్రవక్తవోలే సత్యదేవుడైన ప్రభుని జడియకుండ సాక్ష్యమిచ్చెదం
పేతురు అపోస్తులల్లె యింటబయట మానకుండ ప్రభుని గూర్చి మాటలాడెదం

2. ఎండిన ఈ ఎముకలన్ని యేసులో జీవించులాగ ప్రవచనాన్ని ఎత్తి చెప్పెదం
మండుచు ప్రకాశించు దీపమై యోహానులాగ ప్రభుని త్రోవ సరళపరచెదం

# దేవుడు మా పక్షమున...

దేవుడు మా పక్షమున ఉండగా, మాకు విరోధియెవడు?
జీవముగల దేవుని సైన్యముగా, సాతానునోడింతుము!

“యుద్ధం యెహోవాదే!
రక్షణ యెహోవాదే!
విజయం యెహోవాదే!
ఘనత యెహోవాదే!”

1. మా దేవుని ‘బాహువే’ – తన ‘దక్షిణ హస్తమే’
ఆయన ‘ముఖకాంతియే’ – మాకు జయమిచ్చును
‘తనదగు ప్రజగా’ మము రూపించి
నిరతము మాపై ‘కృప’ చూపించి
తన ‘మహిమకై’ మము పంపించి
‘ప్రభావమును’ కనపరచును

2. మా దేవుని ‘ఎరిగిన’ – జనులముగ ‘మేమందరం’
‘బలముతో’ ‘ఘనకార్యముల్’ – చేసి చూపింతుము
‘దేవునిచే’ ‘శూర క్రియలను’ చేసి
భూమిని ‘తలక్రిందులుగా’ చేసి
‘ఆయన నామము’ ‘పైకెత్తి’
‘ప్రభు ధ్వజము‘ స్థాపింతుము

# జీవ గ్రంథంలో...

జీవ గ్రంథంలో నా నామాన్ని తన రక్తముతో లిఖించిన

యేసునిలో నాకు ఆనందం

యేసునిలో నాకు ఘనవిజయం

“భూమిపై నేనేమి విప్పుదునో అవి అన్నీ

పరమునందున కూడా విప్పబడునులే

భూమిపై నేనేమి బంధించియుంచుదునో

పరమునందున అవి బంధింపబడునులే”

1. అవిధేయతతో నేను కోల్పోయిన దేవుని వారసత్వమును

తన రక్తముతో నాకు అందించెను యేసుడు నా రక్షకుడు

విలువైన తన సొత్తుగ నను చేసి – తన పరిశుద్ధాత్మతో నను నింపి

శత్రు క్రియలన్నిటిపై నాకు జయమిచ్చినట్టి యేసు నా ప్రభునకే స్తోత్రం, స్తోత్రం

2. నేనడుగుపెట్టే ప్రతి స్థలమును యేసుని స్వాస్థ్యం చేసెదను

నన్ను ప్రేమించెడి యేసునిలో అత్యధిక విజయం పొందెదను

ప్రభువైపుకు అనేకులన్ త్రిప్పి, ఆకాశ జ్యోతినై మెరిసెదను

నిత్యం జయోత్సవంతో నన్ను నిలబెట్టుచున్న యేసు నా ప్రభునకే స్తోత్రం, స్తోత్రం

3. సర్వాంగకవచము ధరియించి నే ఆత్మీయ యుద్ధం చేసెదను

ఆకాశమండల దురాత్మలన్ యేసు నామంలో ఓడించెదను

విశ్వాస డాలును చేపట్టి, వాక్యాత్మ ఖడ్గము బిగపట్టి

క్రీస్తు రక్తంపు విలువ, చాట నను వాడుచున్న యేసు నా ప్రభునకే స్తోత్రం, స్తోత్రం

4. ప్రభు రాజ్యమున్ నీతిని మొదటగా వెదకి అన్నిటి పొందెదను

గురి యొద్దకే నే పరుగెత్తుచూ నీతి కిరీటం గెలిచెదను

నా అతిశయకారణం ప్రభు సిలువే, నేనేమైయుంటినో అది ప్రభు కృపయే

నాదు విశ్వాసమును నిరతం కాపాడుచున్న యేసు నా ప్రభునకే స్తోత్రం, స్తోత్రం

# ఆరాధించెదం...

ఆరాధించెదం యూదా గోత్రపు సింహాన్ని

ఆర్భాటించెదం గొర్రెపిల్ల నామాన్ని

సువార్త బూర మ్రోగించెదం

యేసే ప్రభువంటూ ఎలుగెత్తెదం

“అపవాది దుర్గములు కూలాలి

ప్రతి దేశము తలుపు తెరవాలి

ప్రజలంత ఏకమై పాడాలి - ప్రభు యేసుని

ప్రతి చోట సువార్త చాటాలి

ప్రభు సిలువ జెండా ఎగరాలి

ప్రతి జనము యేసునే కొలవాలి - ప్రభు దర్శనం”

ప్రతి జాతి వంశము ఒక గుంపుగ నిత్యమూ, ఒకనాడు యేసునే కొలిచెదం

ఒకటే కుటుంబము, స్తుతియే మా కార్యము, చిరకాలం యేసుతో ఉందుము.

# ఇదిగో వినుమా!

ఇదిగో వినుమా! ఓ లోకమా!
త్వరలో ప్రభువు రానుండెను
“సిద్ధపడుమా! ఓ లోకమా!
సిద్ధపడుమా! ఓ సంఘమా! మరనాత!’

1. మహామహా ఆర్భాటముతో, ప్రధాన దూత శబ్దముతో
దేవుని బూరతో ప్రభువు వేగమే దిగివచ్చును.
ప్రభునందు మృతులు లేతురు సమాధులు తెరువగా!
విశ్వాసులంత దాల్తురు మహిమ రూపును వింతగా!
ఎత్తబడును సంఘము – అయ్యో! విడువబడుట ఘోరము

2. ఏడేండ్లు భువిపై శ్రమకాలం, ప్రాణాలు జారే భయకాలం
బూరలు, తెగుళ్ళు, దైవ ఉగ్రత పాత్రలు
ఆకాశ శక్తుల్ కదులును, గతి తప్పును ప్రకృతి
కల్లోలమౌను లోకము, రాజ్యమేలును వికృతి
సంఘమెంతో హాయిరా! మధ్యాకసాన విందు రా!

3. అన్యాయం చేయువాడు చేయనిమ్ము, అపవిత్రుడట్లే యుండనిమ్ము
పరిశుద్ధుడింకను  పరిశుద్ధునిగుండనిమ్ము
ప్రతివాని క్రియల జీతము ప్రభు తెచ్చును ఒక దినం
రహస్యక్రియలు అన్నియూ బయల్పడునులే ఆ దినం
లోక ధనము బూడిద – నీకుందా పై సంపద!

4. ఓలీవ కొండపై రారాజు అడుగుపెట్టెడి ఆ రోజు
కొండయే చీలును భూగోళమే కంపించును
ప్రతి జనము ప్రభుని చూచును ప్రతి జాతియు మ్రొక్కును
నిజమైన ప్రభువు యేసని ప్రతి నాలుక ఒప్పును
ప్రభుని రెండవ రాకడ! సాతానుకు దడదడ!

5. వెయ్యేండ్లు భువిపై ప్రభుయేసు, పాలించును పరిపాలించును
నీతి, సమాధానం, ఆత్మయందలి ఆనందం
ఈ భూమి దాని కృత్యముల్ సమస్తము కాలిపోవును
మిక్కటమైన వేడితో పంచభూతముల్ లయమగున్
కొత్తభూమి ఆకసం - యింక శాశ్వత జీవితం!

6. క్రీస్తేసును విశ్వసించువారే పరిశుద్ధులుగ తీర్చబడ్డవారే
దేవుని మహిమకు, నిత్యజీవమునకు అర్హులు
జీవం, మరణం, రెండునూ నీ ఎదుటనే యున్నవి
ప్రభుయేసే జీవమార్గమని నీకు తెలుపబడియున్నది
విశ్వసించు ప్రియుడా! కాదు తక్కెడో బిక్కడా!

# జయహే! జయహే!

జయహే! జయహే! క్రీస్తేసు ప్రభుకు జయహే!

జయహే! జయహే! రారాజు ప్రభుకు జయహే!

నరులను చేసిన దేవునికి జయహే! జయహే!

మరణము గెలిచిన ధీరునికి జయహే! జయహే!

త్రిత్వదేవునికి జయహే! తండ్రి దేవునికి జయహే!

ఆత్మనాధునకు జయహే! మన అన్న యేసునకు జయహే! జయహే!

1. తన మాటతో ఈ సృష్టిని చేసిన దేవునికి జయహే!

   తన రూపులో మానవులను సృజించిన ప్రభువునకు జయహే!

   ఆది అంతముకు జయహే! అద్వితీయునకు జయహే!

   అత్యున్నతునకు జయహే! అనాది దేవునకు జయహే! జయహే!

2. దహియించెడి మహిమగ్నితో వసించెడి రాజునకు జయహే!

   పరిశుద్ధుడు పరిశుద్ధుడు అని దూతలు పొగడే ప్రభుకు జయహే!

   అగ్నినేత్రునకు జయహే! ఆత్మరూపునకు జయహే!

   అమరత్వునకు జయహే! అనంత దేవునకు జయహే! జయహే!

3. తన రక్తమున్ మానవులకై కార్చిన యేసునకు జయహే!

   తన బలముతో మరణంబును జయించిన వీరునికి జయహే!

   సిల్వధారునకు జయహే! త్యాగశీలునకు జయహే!

   మరణ విజయునకు జయహే! జీవించు దేవునకు జయహే! జయహే!

4. తన మహిమతో మేఘాలపై వచ్చెడి యేసునకు జయహే!

   తానుండెడి స్థలమందున మనలను ఉంచెడి ప్రభుకు జయహే!

   న్యాయతీర్పరికి జయహే! సర్వశక్తునకు జయహే!

   సర్వోన్నతునకు జయహే! సైన్యముల అధిపతికి జయహే! జయహే!

# నా నీతి నీవే!...

నా నీతి నీవే! నా ఖ్యాతి నేవే - నా దైవమా యేసయ్యా!
నా క్రియలు కాదు, నీ కృపయే దేవా! - నా ప్రాణమా! యేసయ్యా!
నదులంత తైలం, విస్తారబలులు, నీకిచ్చినా చాలవయ్యా
నీ జీవితాన్నే నాకిచ్చినావు - నీకే నా జీవమయ్యా!
**హల్లెలూయా ఆమేన్ హల్లెలూయా - (2)**

1. నా దీన స్థితిని గమనించి నీవు దాసునిగా వచ్చావుగా!
నా దోష శిక్ష భరియించి నీవు నను నీలో దాచావుగా!
ఏమంత ప్రేమ! నా మీద నీకు నీ ప్రాణమిచ్చావుగా!
నీ రక్తమిచ్చి కొన్నావు నన్ను - యజమానుడవు నీవేగా!

2. నా ప్రియులే నన్ను వెలివేసినపుడు నీవు చేరదీశావుగా!
నా ప్రక్క నిలిచి నను ధైర్యపరచి, కన్నీరు తుడిచావుగా!
నేనున్నా నీకు భయమేలనంటూ ఓదార్పునిచ్చావుగా!
చాలయ్యా! దేవా! నీ కృపయే నాకు బ్రతుకంతయూ పండుగ!

3. ఆ ఊబిలోన నే చిక్కినపుడు నీవు నన్ను చూశావుగా!
నీ చేయిచాపి, నను పైకి లేపి, నీ వాక్కునిచ్చావుగా!
నా సంకటములు, నా ఋణపు గిరులు అన్నిటిని తీర్చావుగా!
నీలోన నాకు నవజీవమిచ్చి, నీ సాక్షిగా నిలిపావుగా!

# ఇశ్రాయేలును కాపాడు దేవుడు...

ఇశ్రాయేలును కాపాడు దేవుడు

కునకడు నిద్రపోడెన్నడు

“భూమి మారినా, జలములు పొంగినా

కొండలు కదిలినా, భయము లేదుగా!

మారని దేవుడు, విడువని నాథుడు

యేసు ప్రభువే మాకు తోడుగుండగా!”

1. ఇత్తడి తలుపులను ఇనుప గడియలను మా దేవుడే పగులగొట్టును

మా ముందర ఆయనే నడుచును, ఈ భూమిని మేం స్వతంత్రించను

రహస్యమందలి ఆత్మల ధనము – ప్రపంచపు కోట్లాది జనము

మాకు సొత్తుగ, స్వాస్థ్య ధనముగా, యిచ్చెను ప్రభువు యిది సత్యం ఆమేన్!

2. జలములలో బడి మేము దాటినా, అగ్నిలో బడి మేం నడచినా

ఏ అపాయము మా దరి చేరదు, యేసు రక్తపు కవచముండగా!

ఎడారి నేలను సెలయేళ్ళుగా – అరణ్య భూమిని నీటి మడుగుగా

చేయును ప్రభువు, కుమ్మరించి, కడవరి వర్షము, యిది సత్యం ఆమేన్!

3. పగలు ఎండైనా, రాత్రి వెన్నెలైనా ఏ దెబ్బైనా తగులనీయదు

చీకటి బాణమైనా, ఏ తెగులైనా మా గుడారమును చేరనీయదు

మా పాదములకు రాయి తగులకుండగా – మా మార్గములలో మాకు తోడుండగా

(మార్గమంతటిలో)

తన దూతలకు, ఆజ్ఞాపించును, మాకై ప్రభువు, యిది సత్యం ఆమేన్!

4. మాకు విరోధముగా రూపింపబడిన ఏ ఆయుధము వర్ధిల్లదు

మా మార్గము అంతకంతకు దైవమహిమతో వర్ధిల్లును

మా తలలపై నిత్యానందము, మా నోటిలో నూతన గీతము

ఉంచెను ప్రభువు, అభిషేకించి, తన మహిమార్థం యిది సత్యం ఆమేన్!

5. సదలిన చేతులను, తొట్రిల్లు మోకాళ్ళను యేసుని పేరిట బలపరిచెదం
తత్తరిల్లు హృదయాలను మీ ప్రభువచ్చెనని ధైర్యముగుండమని ధృడపరిచెదం
సాతాను కాడిని విరుగగొట్టెదం, దుర్మార్గ కట్లను మేం విప్పెదం
అగ్నినుండి, జనముల లాగి, ప్రభువును చూపెదమిది సత్యం ఆమేన్!

6. నరులను పట్టేటి జాలరులముగా మేం దైవ రాజ్యపు వలను విసురుతాం
యేసు రక్తమే పాపం కడుగునని సర్వలోకానికి చాటి చెప్పుతాం
రారాజుకు రాయబారులం మేము - క్రీస్తేసుతో జతపనివారము
యేసునందలి ఆనందమే, మాకు బలము, యిది సత్యం ఆమేన్!

# జయము నీదే!

జయము నీదే జయము నీదే ఓ సేవకుడా
భయములేదు భయములేదు ఓ సైనికుడా

“హల్లెలూయా హల్లెలూయా హల్లెలూయా హల్లెలూయా
హల్లెలూయా హల్లెలూయా హల్లెలూయా”

1. యేసు క్రీస్తు నీతో ఉంది చేయిపట్టి నడుపగా
   భయమేంటి నీకు భయమేంటి?

2. రాజులే అయినా అధికారులే అయినా
   భయమేంటి నీకు భయమేంటి?

3. ముందు సంద్రమే ఉన్నా వెనుక శత్రువే తరిమినా
   భయమేంటి నీకు భయమేంటి?

4. వేలమంది పడినా పదివేలమంది కూలినా
   భయమేంటి నీకు భయమేంటి?

# జయపతాకం...

జయపతాకం ఎగరాలి

ఈ దేశం స్వంతం కావాలి

ప్రతి మోకాలు వంగాలి

క్రీస్తు రాజ్యం కావాలి

“హల్లెలూయా ఓ హల్లెలూయా

హల్లెలూయా ఓ హల్లెలూయా”

1. ప్రతి జాతియు ప్రతి జనమును

క్రీస్తు ప్రభువని ఒప్పుకోవాలి

ప్రతి గోత్రము ప్రతి వంశము

క్రీస్తు ప్రభువు ఎదుట మోకరించాలి

ఈ కనులతో నేను చూడాలి

క్రీస్తు రాజ్యాన్ని

JESUS LOVES INDIA
JESUS SAVES INDIA
JESUS HEALS INDIA
JESUS BLESS INDIA

2. ఈ దేశంలో ప్రభుని పాలన

ఈ జీవితంలోనే చూడాలి

యేసు నామమే జయజయమని

ప్రతి స్వరము ప్రభుని స్తుతియించాలి

ఈ దేశాన్ని ప్రభుకు బహుమతిగా నేను యివ్వాలి.